రాలిన మొగ్గ

చిల్లర భవానీదేవి

టక్ టక్ మంటూ అప్పటిదాకా కొంప లంటుకుపోతున్నట్లు పరుగెడుతున్న రైలు నీరసం ఆవరించినట్లుగా వేగం తగ్గించుకుంది. రోజూలాగే ఆ రోజు కూడా ఆ వంతెనదాకా రాగానే ఎవరో ఎఱ్ఱ జెండా చూపినట్లు, కళ్ళెంపట్టి లాగబడిన గుర్రంలాగా ఆగిపోయింది.

రైలు ఆగగానే వాతావరణం ప్రశాంతంగా అన్పించింది. రైల్లో ఉన్న వాళ్ళంతా రైలెందుకు ఆగిందోనని 'సిగ్నల్ ఇవ్వలేదా' అనుకుంటూ కిటికీల్లోంచి బయటకు చూసే పందికొక్కుల్లా చూడసాగారు. సిగ్నల్ ఏమీ కన్పించలేదు. వాళ్ళకేమీ అంతుపట్టక 'ఎవరైనా చైన్ లాగారేమో' అని తమలో తాము కొద్దిసేపు విసుక్కుని నిద్రలోకి కొందరు వొరిగిపోయారు. కొందరు కబుర్లలో మునిగిపోయారు.

రైలుపట్టాలకు దగ్గరగా ఉన్న గుడిసెల ముందునుంచి ఒక కాలిబాట రైలు పట్టాలదాకా వచ్చి ఆగిపోయింది. పట్టాల అవతల నుంచి ఆ బాట సీరియల్ నవలలా మళ్ళీ కన్పిస్తుంది.

వాతావరణం చీల్చుకుంటూ ఒక పసి కేక విన్పించింది.

పట్టాల దగ్గరగా నడుస్తున్న ఒక నడి వయసు స్త్రీతో పరుగులాంటి నడకతో నడుస్తున్న ఒక నిక్కరు లేని ఐదేళ్ళ కుర్రవాడు కన్పించాడు. వాడు ఉత్సాహంగా రైలుకేసి చూస్తూ చేయి ఊపుతూ అరుస్తున్నాడు.

ఇంతలో రైల్లోంచి ఎవరో దూకారు. రైలు దూకిన కుర్రవాడికి పన్నెండేళ్ళుంటాయేమో! మాసిపోయి అక్కడక్కడా చిరిగి దారాలు వేలాడుతున్న లాగూ చొక్కా, ఒకచేతిలో నల్లటి మురికిసంచీ, రెండవ చేతితో రైలు రాడ్ పట్టుకుంటూ క్రిందికి ఉరికాడు. చీకిపారేసిన తాటి టెంకలాంటి వాడి జుట్టు గాలికి ఆనందంగా ఇష్టంవచ్చినట్లు నాట్యం చేస్తున్నది. రైలు దిగిన ఆ కుర్రవాడు ఎంతో స్టైయిల్‌గా విలువయిన వస్తువును పట్టుకున్నట్లుగా తన మురికి సంచీ అపురూపంగా పట్టుకొని తనవారికేసి నడిచాడు.

తల్లి ప్రక్కన నిల్చుని ఆనందంగా

వంశీ బర్కిలి-80 కథానికల పోటీలో తృతీయస్థానం పొందిన కథ

చూస్తున్నాడు తమ్ముడు. మరు నిము షంలో వాడి ప్రక్కన నిలబడ్డాడు. తమ్ముని తలపై ప్రేమగా చేయివేసి నిమిరాడు. బుగ్గమీద తమాషాగా చిటికె వేశాడు. ప్రక్కన ఉన్న తల్లికేసి కళ్ళె త్తయినా చూడలేదు. నిక్కరు జేబు లోంచి కొంత చిల్లర తీసి తమ్ముడి చేతిలో పెట్టాడు.

తమ్ముడు గుప్పెటలో ఆ డబ్బుల్ని భద్రంగా పట్టుకుని ఆశగా అన్నమొహం లోకి చూస్తూ 'అన్నా! ఒకసారి ఇంటకి రావూ!' అని అడిగాడు.

అన్న ఏమీ మాట్లాడలేదు. ప్రేమగా వాడి తల మళ్ళీ నిమిరాడు. వాడి బుగ్గపై ఒక ముద్దు పెట్టుకున్నాడు. 'నువ్వు అమ్మతో వెళ్ళు' అని తమ్ముడితో చెప్పి, కదుల్తున్న రైలు సునాయాసంగా ఎక్కే శాడు.

మరికి సంచీలోంచి రెండు బ్రష్‌లు, ఒక నల్లని చిన్న డబ్బా తీసి సంచీ చేతికి తగిలించుకొని వాటిని చేత్తో పట్టుకుని 'పాలిష్!' అంటూ కంపార్టుమెంటులో తిరగసాగాడు.

రైలు కదిలేదాకా చూసి తమ్ముడు తల్లిదగ్గరగా జరిగి అన్న ఇచ్చిన డబ్బులు ఇచ్చాడు.

'అన్న ఇంటికి రానన్నాడా!' అన్నీ విన్నా ఏదో ఆశగా అడిగిందామె.

'ఆ!' వాడు పెద్దగా అరిచాడు.

'ఏమన్నాడు?'

'ఏమీ అనలేదు' చిన్నబోయిన మొహంతో బదులిచ్చాడు.

'సరే పద! పొద్దెక్కుతోంది' పిల్ల వాడ్ని తొందరపెట్టి నడిచిందామె. మనసునిండా పెద్దకొడుకుని గురించిన ఆలోచనలు కారుమేఘాల్లా కమ్ము కున్నాయి.

ఇప్పటికి సరిగ్గా రెండు నెలల క్రిందట ఏడుపుమొహంతో స్కూలు నుంచి ఇంటికివచ్చాడు వాడు.

'నేనింక బడికి పోను' అన్నాడు పట్టుదలగా తల్లితో.

'ఎందుకని?' కోపంగా అరిచిందామె.

'నాకు ఏమీ అర్థంకావటం లేదు. మాస్టరు క్లాసులో ఏమీ చెప్పకుండా చాలావరకు ఇంటిదగ్గర నేర్చుకొని రమ్మంటున్నాడు. నాకు ఇంటిదగ్గర ఎవరు చెపుతారు?' ఎదురు ప్రశ్నవేశాడు వాడు.

వాడు వేసిన ప్రశ్నకు జవాబు ఆమె వద్ద లేదు. ఆమె, ఆమెభర్త ఇద్దరూ చదువుకోనివారే! పగలంతా పనిచేసి శ్రమించి, వచ్చిన డబ్బుల్తో తాగి ఇల్లు చేరే భర్తని తిట్టుకుంటూ పిల్లల్ని చదివించి ప్రయోజకులుగా చెయ్యాలని కాయకష్టం చేస్తుందామె. కొడుకు చదువు మానేస్తానంటే ఆ తల్లి మనసు తల్లడిల్లిపోయింది.

ఆ రోజు సాయంత్రమే పుస్తకా లన్నీ పాతపుస్తకాలు కొనే షాపులో



అమ్మేసి బ్రష్‌లు, పాలిష్‌డబ్బా తెచ్చాడు వాడు.

'నేను పాలిష్ చేసి సంపాదిస్తాను.'

'నీకేం రోగమిది? మిగతా పిల్లలంతా చదూకోడం లేదూ!' కోపంగా అరిచింది.

'మిగతా పిల్లలంతా స్కూలు వదలగానే మాస్టరింటికి వెళతారు ట్యూషన్‌కి.'

'నువ్వూ కూడా వెళ్ళు.'

'కానీ మాస్టరు వాళ్ళందరి దగ్గరా నెలకు పదిహేను రూపాయలు తీసుకుంటున్నాడు తెలుసా?' కోపంగా చూశాడు రాము.

'మనం కూడా ఇద్దాము' తల్లి బ్రతిమిలాడుతూ అంది.

తల్లి ట్యూషన్ డబ్బులు కట్టాలంటే ఎంత కష్టపడాలో రాముకు తెలుసు. తల్లి ప్రేమకు మనసులోనే ఆనందించాడు.

'వద్దమ్మా! ఈ చదువు సాగేదికాదు. నేను సంపాదించి నిన్ను సంతోష పెడతాను. నువ్వు నాన్నతో డబ్బుల కోసం పోట్లాడనవసరం లేదు' దృఢంగా అన్నాడు.

'పసివాడివి. నీ కేపని చేతవుతుందిరా' తల్లి మనసు రెపరెపలాడింది.

వెంటనే రాము ఎంతో ఆప్యాయంగా బ్రష్‌లు, పాలిష్‌డబ్బా చూపాడు.

అవి చూడగానే తను కన్న కలలన్నీ కళ్ళముందే కరిగిపోయినట్లు

విలవిల్లాడిందా మాతృహృదయం. వాడితో ఆ పని మానమని, చదువుకోమని ఎంతో చెప్పింది.

రాము వినలేదు. తన నిర్ణయానికి తిరుగులేదని చెప్పి ఇంట్లోంచి వచ్చేశాడు.

ఇది జరిగి రెండు నెలలయింది. ఆ రైలు రోజూ ఆ వంతెన దగ్గరికి రాగానే ఆగిపోతుంది.

రైలు అక్కడ ఆగటానికి గల కారణాలు చాలామంది చాలా రకాలుగా అనుకుంటారు. కొందరు దొంగతనంగా తెచ్చే సరుకులు అక్కడ దింపుకోటానికే రైలు ఆపుతారని అంటారు.

కొందరు నాగరికులు అక్కడ రైలు క్రాసింగ్ ఉంది కాబట్టి ఆగుతుందని అంటారు.

రాము ఆ రైలులోనే వస్తాడు రోజూ. ఎందుకంటే రోజూ ఇదే టైముకు ఇంటి పని చేసుకుని తల్లి పైబస్తీలోని ఇళ్ళలో అంట్లుతోమటానికి వెళ్తుంది.

రాము తమ్ముడు ఎప్పుడూ తల్లితోనే ఉంటాడు. రాము రోజూ తనకిచ్చే డబ్బులన్నీ అమ్మకిచ్చేటప్పుడు పది పైసలు దాచుకుంటాడు. ఆ సంగతి తెల్సినా తల్లి తెలీనట్లే ఉంటుంది.

ఆ పదిపైసలతో వాడు పంచదార గోలీలు కొనుక్కుంటాడు. కానీ అన్నీ ఒంటరిగా తినడు. వాటిల్లో రెండు గోలీలు చెల్లెలికోసం దాచి ఉంచుతాడు. ఎందుకంటే చెల్లెలంటే వాడికి ప్రాణంగాబట్టి.

రోజులాగే ఆ రోజు కూడా స్టేషన్ నుంచి రైలు కదలగానే రాము ఒక కంపార్టుమెంటులోకి ఎక్కాడు. అది ఫస్ట్‌క్లాస్ కంపార్టుమెంట్. వాడు 'పాలిష్!' అంటూ ప్రయాణీకులని అడిగాడు.

అకస్మాత్తుగా పరిచిత స్వరం విన్పించి ఆ వైపు చూశాడు. ఆ వ్యక్తిని చూడగానే వాడి కళ్ళు మెరిశాయి. దగ్గరిగా వెళ్ళి 'పాలిష్ సార్!' అన్నాడు.

ఆ వ్యక్తి అంగీకార సూచకంగా తల ఊపాడు. రాము ఎంతో ఆసక్తిగా ఆప్యాయంగా ఆ బూట్లని సంచిలోని సామాన్లు బయటకు తీస్తూ 'సాదానా! క్రీమ్ కలరా?' ప్రశ్నించాడు వినయంగా.

'సాదా' ఆయన బదులిచ్చాడు.

'బాగా మెరిసేట్లు చేస్తాను సార్! క్రీమ్ కలర్ వేయించుకోండి సార్! పావలా చాలు.'

'వద్దు' వాడి వంక చూడకుండానే ఇంగ్లీషు పుస్తకంలోంచి కఠినంగా అన్నాడాయన.

రాము ఏమీ మాట్లాడకుండా మెల్లగా పాలిష్ చేయసాగాడు. తల వంచుకుని పాలిష్‌చేస్తున్న రాము తలకు కాలు మార్చుకుంటున్న ఆయన పాదం తగిలింది. అప్పుడు రాముని గుర్తుపట్టాడాయన.

'ఓ....రామూ! నువ్వా.'

'అవును సార్!' మాష్టారు తనను గుర్తుపట్టి పలకరించినందుకు సంతోషంతో ఉప్పొంగిపోయిందా పసి హృదయం.

'ఈ పని ఎప్పుడు మొదలుపెట్టావు?'

'రెండు నెలల్నుంచండి' వినయంగా జవాబిచ్చాడు.

'ఆ.... మంచిది. నీకు తగిన పనే ఇది.' ఆయన నిరసనగా అంటూ పుస్తకంలో తలదూర్చాడు మళ్ళీ.

ఆ మాటలు వింటూనే రాము శరీరంలో వందల సూదులు గుచ్చుకున్నట్లనిపించింది. ఏమీ మాట్లాడలేకపోయాడు వాడు.

పాలిష్‌చేస్తున్న వాడి చేయి వణుకుతూ మాటిమాటికీ ఆగిపోతున్నది.

ఇంతలో ఆ వంతెన వస్తున్నది. రైలు వేగం తగ్గలేదింకా. రాము పాలిష్ చేయటం ఆపి త్వరగా లేచి నిల్చున్నాడు. వాడి మొహం కోపంతో జేవురించి ఉంది.

రైలింకా స్పీడు తగ్గించుకోలేదెందుకో. ఆ వంతెన వచ్చేసింది. కోపంగా వాడి చేతిలోని బ్రష్‌ను మాస్టరు కేసి విసిరాడు. రైల్లోంచి దూకేశాడు. అదే సమయానికి వాడి తమ్ముడి కేక బిగ్గరగా వినిపించింది.

రైలు మెల్లగా ఆగింది.

రాము నిర్జీవ శరీరం రైలుపట్టాలకు కొంచెం దూరంలో రక్తసిక్తమై పడి ఉంది. గట్టిగా బిగించిఉన్న వాడి గుప్పెటలో పాలిష్ డబ్బా ఉంది.

రాము తల్లి ఈ దృశ్యం చూస్తూనే ఒక కేకతో మూర్ఛపోయింది. తమ్ముడు అన్న దగ్గరకు వస్తుంటే చుట్టూ ఉన్న జనం వాడిని దూరంగా నెట్టేస్తున్నారు. అన్న కేమయిందో తెలీక వాడు ఏడుస్తున్నాడు. హీనస్వరం ఎవరూ పట్టించుకోవటం లేదు.

గుంపులోంచి ఎవరో అన్నాడు. 'అరె! వీడు పాలిష్ కుర్రాడు' అని.

ఇంతలో గాలిలోకి తమ్ముడు విసిరిన చొక్కా వచ్చి రాము మొహాన్ని కప్పేసింది.

తను చదువుకోడానికి సహకరించక, పైగా తాను శ్రమించి బ్రతుకుతుంటే అపహాస్యం చేసి తన లేతమనస్సును గాయంచేసిన ఈ సమాజంలోని విషపురుగులకు మొహం చూపటం కూడా ఇష్టంలేనట్టుగా రాము మొహంమీద తమ్ముడి చొక్కా పరుచుకుంది.

విషయం విన్న రాముతండ్రి తాగిన మైకంలో భార్యను ఓదారుస్తూ 'ఎందుకేడుస్తావే! వాడిలాటి వాళ్ళ బతుకింతే!' అని నిశ్చలంగా చెప్తున్నాడు.